## పిడుగుపాటుకు శాంతి:

"దేవాలయే, నదీతీరే, తటాకే, కూపే, స్వక్షేత్రే |
అశనిపాతేయది యజమానస్య పీడాభవేత్ |
ఐంద్రే మహద్భయం చైవ, ఆగ్నేయాం అగ్నిజం భయమ్ |
యామ్యే మృత్యువధాచైవ, నిర్బతే రాక్షసం భయమ్|
వారుణేజలరోగం స్యాత్, వాయవ్యాం రాజ విగ్రహం |
సోమేతు ధననాశంస్యాత్, ఈశాన్యాం ధాన్యనాశనమ్||
పాకస్థానేఽశనిపాతే, భార్యారోగ శరీరిణీ|
తస్మాచ్ఛాంతిం ప్రవక్ష్యామి, దీర్ఘాయష్యప్రదాం శుభామ్ ||

దేవాలయములందుగాని, నదీతీరములందు గాని, చెరువులలో గాని, నూతులలో గాని, ఇండ్లపై గాని పిడుగు పడినచో యజమానునికి పీడు గల్గును. లేక గ్రామస్థులకు పీడగల్గును. తూర్పు భాగమున పిడుగు పడినచో గొప్ప భయము, ఆగ్నేయ దిక్కున పడినచో అగ్నిభయము, దక్షిణ దిక్కున పడినచో మృత్యుభయము, నిర్‌ఋతి దిక్కునందు రాక్షస స్వభావులగు వారిచే భయము, పశ్చిమమున జలరోగము (జలోదరాదులు) వాయవ్యమందురాజులతో(నాయకులు అధికారులతో) విరోధము, ఉత్తరమున ధన ||నాశనము, ఈశాన్యమున ధాన్య నాశనము, వంట ప్రదేశమున భార్యకు రోగము కల్గును. కావున తప్పక శాంతి చేయవలెను.

### శాంతి విధానము :

వినాయక పూజ మొదలు ఋత్విగ్వరణము వరకు చేసి, రంగవల్యాదులచే అలంకరింపబడిన ప్రదేశమందు ధాన్యమును, దానిపై బియ్యమును, పైన మినుగులను, ఆపైన నువ్వులను మండపముగా పోసి అక్కడ అష్టదళ పద్మమును లిఖించి, నాలుగు దిక్కులందు, మధ్యను కలిపి 5 కలశములను స్థాపించవలెను. కలశములందు పంచపల్లవాదుల నుంచి ప్రధాన కలశయందు త్ర్యంబక సహిత గౌరీదేవిని తూర్పు కలశమందు - ఇంద్రుని, దక్షిణమున యముని, పశ్చిమమున

వరుణుని, ఉత్తరమున సోముని ఆవాహన చేయవలెను. ప్రతిమలను తూర్పున **"శ్రియేజాత"** శ్రియమావాహయామి అని, దక్షిణమున **"జాతవేదసేను"** దుర్గను పశ్చిమమున **"హిరణ్య వర్ణా"** మని లక్ష్మిని, ఉత్తరమున **"ప్రణోదేవీ"** అని సరస్వతిని ఆవాహన చేయవలెను. మరల తూర్పు కలశమందు **"త్రాతారమని"** ఇంద్రుని, దక్షిణమున **"సుగన్నః పంథామని"** యముని, పశ్చిమమున **"ఇమంమే వరుణ"** అని వరుణుని, ఉత్తరమును **"వయగ్ం సోమమని"** సోముని ఆవాహన చేసి పూజించవలెను. పిదప ఋత్విజులు వేదపారాయణ, **"యతఇంద్ర"** అను మంత్రమును 108 పర్యాయములు, **కృణుష్వపాజ, ఆపోహిష్ఠాదులు, హిరణ్య వర్ణాది నాల్గు, పవమాన, అను వాకము, నమక, చమక, పురుష సూక్తాదులు, పంచశాంతులు, దిక్పాలక మంత్రములు,** యజమాని జన్మ నక్షత్ర మంత్రాలు, ఘృత, భూ, వరుణ, విష్ణు, బ్రహ్మ, రుద్ర, ముంచామిత్వ సూక్తములను పఠించవలెను.

అగ్ని ప్రతిష్ఠ చేసి సమిదాజ్య చరువులచే ఆవాహిత దేవతలకు యథాశక్తి హోమములను త్ర్యంబకముచే తిలలను అష్టోత్తర శతాహుతుల నీయవలెను. దశదానాలు. ఆజ్యావలోకనము చేసి భూరిదాన దక్షిణ లిచ్చి భోజనాదులను ముగించవలెను.